నీ మీద ప్రేమతో, నువ్వు గెలుస్తావనే ప్రేమతో నేను ఓడిపోయాను సుమా అంటే ..... ఆ మాటకు మహతి ప్రతిస్పందన ఎలా ఉంటుంది!

నమ్ముతుందా? నమ్మదు .....

ఒకసారి నమ్మకం పోయాక ఆడది చచ్చినా నమ్మదు ..... తను గెలిచి తీరాలి. లక్ష్యాన్ని, గమ్యాన్ని సాధించాలి.

"కంగ్రాచ్యులేషన్స్ మిష్టర్ ..... మధూ ..... విజయం మనదే ..... " అరుపులాంటి పలకరింపుతో లోనికొచ్చాడు సుమదేవ్.

"వాట్ సార్ ..... ఏమైంది ..... "

"ఏమైందని తాపీగా అడుగుతావేంటయ్యా ..... లోటస్ చాక్లెట్ కంపెనీ యాడ్ కాంపైన్ మనకే వచ్చింది ..... లింటాస్ ..... ముద్ర ..... అక్షర ..... డిఫ్యూజన్ ..... ఎంతమంది పోటీ పడినా ..... ఆ కాంట్రాక్టు మనకే వచ్చింది ..... ఈ దెబ్బతో మన యాడ్ ఏజెన్సీకి ఇంటర్నేషనల్ రిప్యుటేషన్ రావడం ఖాయం ..... "

సుమదేవ్ ముఖం వెయ్యి కాండిల్స్ బల్బులా వెలిగిపోతోంది. దాదాపు పాతిక కోట్ల కాంట్రాక్టు అది. ఒక్క భారతదేశంలోనే కాకుండా, అమెరికా, బ్రిటన్‌లలోని కొన్ని ఏరియాల్లో కూడా యాడ్ కాంపైన్ చెయ్యడమ ఆ కాంట్రాక్టు గొప్పదనం. అందుకే గొప్ప గొప్ప యాడ్ ఏజెన్సీలు ..... ఆ కాంట్రాక్టు కోసం పోటా పోటీలు పడ్డాయి.

సుమదేవ్ పట్టలేని ఆనందంతో, కౌగలించేసుకుని, ముద్దు పెట్టేసుకుని "ఈ సందర్భంగా నీకేం కావాలో కోరుకో ..... " అని అడిగాడు.

"నాకిప్పుడేం కోరికలు లేవు సర్. ప్రస్తుతానికి వదిలెయ్యండి. ఏదో రోజు అడుగుతాను --" అన్నాడు మధుకర్ ఏదో ఆలోచిస్తూ.

"వదిలెయ్యమన్నావ్‌గదా-- వదిలేస్తున్నాను-- ఎందుకో తెల్సా ..... నిన్నే నేను ఏదో రోజు ఒక కోరిక కోరతాను. నా మాట తీసివెయ్యకుండా తీరుస్తావని నాకు నమ్మకం వుంది. అందుకు--" సుమదేవ్ ముఖంవేపు ఆశ్చర్యంగా చూశాడు మధుకర్.

అంతవరకూ హుషారుగా మాట్లాడుతూ, సడన్‌గా సీరియస్‌గా మారే సుమదేవ్ మూడ్స్ గురించి తెల్సు మధుకర్‌కి.

అందుకే నవ్వుకుంటూ తన రూం వేపు నడిచాడు.

*                    *                    *                    *

బేగంపేట ఎయిర్‌పోర్టునుంచి బయలుదేరిన కారులో మహతి కూర్చుని వుంది.

పక్కన రఘురామశెట్టి కూర్చుని వున్నాడు.

మహతి చెపుతోంది. రఘురామశెట్టి చిన్నపిల్లాడిలా వింటున్నాడు.

"ఒక రకంగా మనకొచ్చిన ఆఫర్, రేరెస్ట్ ఆఫర్ సర్ - నేషనల్ టెక్స్‌టైల్ కార్పొరేషన్ ప్రతిఏటా కొని కోట్ల రూపాయల విలువైన రెడీమేడ్ గార్మెంట్స్‌ని ఎగుమతి చేస్తుంది. దేశంలో గుర్తింపు పొందిన పది పదిహేను కంపెనీలకు ఆ కాంటాక్టు ఇస్తుంది. అలాగే ఈ ఏడాది మన జెన్నీ ఫాబ్రిక్స్‌కి ఒక అవకాశాన్నిచ్చింది. మనం దాదాపు పది కోట్ల రూపాయల విలువచేసే గార్మెంట్స్‌ను గవర్నమెంట్‌కి ఏడాది లోపుగా ఇవ్వాలి" చెప్పడం ఆపింది మహతి.

"పదికోట్లు కంట్రాక్టా? మనకా?! అన్ని కోట్లు మన దగ్గర ఎక్కడివి-- మనకు మిషనరీ ఏది?"

ఆ అదృష్టాన్ని వెంటనే జీర్ణించుకోలేకపోయారాయన.

"డబ్బు గురించి మనం బెంగపడాల్సిన అవసరం లేదు సర్ ..... టెక్స్‌టైల్ కార్పొరేషన్ మనకు బ్యాంకు ద్వారా లోను ఎరేంజ్ చేస్తుంది. మన మెటీరియల్ ఫారిన్‌లో బాగా పోతుందని, దీని ద్వారా ఫారెన్ కరెన్సీ వస్తుందని ఆర్థిక నిపుణుల కమిటీ చెప్పినమీదట, కార్పొరేషన్ అఫీషియల్స్ స్పెషల్ రికమండేషన్ మీద మనకీ అవకాశాన్నిస్తున్నారు"

కొంతమంది మనుషులు మట్టిని ముట్టుకుంటే బంగారం అవుతుందని వినడమే కానీ వేళ మహతిని చూస్తుంటే మామూలు మనిషిలా కనిపించటంలేదు.

మహతి తెలివితేటలకు, పట్టుదలకు, లక్ష్యసిద్ధికి, అదృష్టానికి మనసులోనే జోహార్లు అర్పించాడు రఘురామశెట్టి.

* * *

గత నెలరోజులుగా రాఘవేంద్ర నాయుడుకి నిద్రపట్టడంలేదు. అంతబిజీ షెడ్యూల్‌లో కూడా ఏదో సమయంలో మహతి జ్ఞాపకం వస్తూనే వుంది.

మహతి గర్భవతా? అయితే దానిక్కారకులు ఎవరు?

తన కొడుకు మధుకర్, మహతి మాటలవల్లే బయటకి వెళ్ళాడంటే తనొప్పుకోడు. ఎందుకంటే-- ఆకర్షణలేనిదే ఒక ఆడపిల్ల, ఒక మగ వాడిచేత ఇలాంటి పని చేయించలేదు.

మరి--!

మహతి గర్భవతి అని తెలిస్తే--

మధుకర్ ఏమైపోతాడు? తనకు దక్కుతాడా ..... ఏం చెయ్యాలి?

ఏం చెయ్యాలన్నా, తనొక్కడే రహస్యంగా శోధించాలి.

ఓ రోజు --

రవికిరణ్ ద్వారా అసలు విషయం తెలుసుకున్నాడు.

మహతికి కావలసిన స్నేహితురాలు హేమలత అని.

"అవును సర్ - మహతి చాలాసార్లు మా యింటికొచ్చింది. హేమని కలుస్తుంటుంది."

"ఇన్నాళ్ళూ నాకెందుకీ విషయం చెప్పలేదు" అని అడగలేదు రాఘవేంద్ర నాయుడు. అదే నాయుడుగారి సంయమనశక్తి. ఆ మాట విన్నప్పుడే ఆయనేం చెయ్యాలో నిర్ణయించుకున్నాడు.

*　　　　　　　　　*　　　　　　　　　*

ఆఫీస్ రూంలో కూర్చుని అప్పుడేవచ్చిన ఇండియాటుడేని తిరగేస్తున్నాడు మధుకర్--

ఓ పేజీ దగ్గర చటుక్కున ఆగిపోయాడు.

**When a woman can discuss politics, with as much flair as she can disowns art ...... chances are -- She's JENNY WOMAN - MAHATHI.**

అరుదైన హెడ్డింగ్‌తో, అరుదైన వ్యాసం.

గబగబా చదివాడు మధుకర్.

జెన్నీ ఫాబ్రిక్స్ వెనక వుంది మహతా ..... అతని అంతులేని ఆశ్చర్యానికి అవధిలేదు.

ఒకే సమయంలో అతని ముఖంలో ఆనందం, గర్వం, ఆ రెండూ కలగలిపిన సంతృప్తి కన్పించాయి.

ఎన్నాళ్ళనుంచో వెతుకుతున్న మహతి ఎడ్రస్ దొరికింది. వెంటనే మధుకర్ చేయి ఫోనువేపు వెళ్ళింది.

292929

ఒక్కొక్క అంకెమీద మధుకర్ చేయి మెత్తగా పడుతోంది.

అవతల పక్క ఫోన్ మోగుతున్న సవ్వడి.

ఎవరో రిసీవర్ తీసుకున్న శబ్దం.

"హలో ..... జెన్నీ ఫాబ్రిక్స్ ..... "

"కెన్ ఐ స్పీక్ టు మహతి "

"షీ ఈజ్ నాట్ ఎ వైలబుల్ నౌ సర్-" తియ్యని కంఠం.

మహతి స్వయంగా మాట్లాడుతుందని ఊహించిన మధుకర్ మూడ్ అప్‌సెట్ అయింది.

"ఇమ్మీడియట్‌గా కాంటాక్ట్ చేయాలి, ఏ నెంబర్లో వుంటారో చెప్పగలరా."

"ఒన్ మినిట్ సర్!"

సరిగ్గా ఒక నిమిషం తర్వాత-

నెంబరు చెప్పింది ఆపరేటర్. మరో రెండు నిమిషాల తర్వాత ఆపరేటర్ ఇచ్చిన నెంబరుకి డయల్ చేయడం ప్రారంభించాడు మధుకర్.

*　　　　*　　　　*

"నీ ప్రసవం రోజులు దగ్గర పడుతున్న సమయంలో ఎక్కువ శ్రమపడకు మహీ-- రెగ్యులర్‌గా మెడిసిన్స్ వాడు-" ప్రిస్క్రిప్షన్ చేతికి అందిస్తూ అంది హేమ మహతితో.

"నువ్వెప్పుడూ చెప్పలేదే."

"అలాగని నెగ్లెక్ట్ చెయ్యకు- పని వత్తిడిలోపడి నువ్వు సరిగ్గా తినడంలేదు. నువ్వు బాగా తినాలి. నీకోసం కాదు. బిడ్డ ఆరోగ్యంకోసం తప్పదు- ఇకనుంచి వారానికొకసారి టెస్టింగ్‌కురా."

"నేను రాలేని సమయంలో ఫోను చేస్తాను- నువ్వే రావాలి."

"ఏం?"

"హయత్‌నగర్ ఏరియాలో ఫ్యాక్టరీ కన్‌స్ట్రక్షన్లో వున్నా- నీకు తెలుసుగా అన్నీ నేనేనని."

“ఎట్ లాస్ట్ యూ గాటిట్-” ప్రశంసా పూర్వకంగా అంది హేమలత .

“కాదు హేమా ..... ఆశ, ఆశయం, అనంతం- ఇప్పుడేదయితే నేను సాధించానని అందరూ అంటున్నారో- యిది నా అవిశ్రాంత ప్రయాణంలో ఒక మజిలీ మాత్రమే” లేచి నిలబడింది మహతి .

అదే సమయంలో ఫోన్ రింగవుతోంది. మహతి ఆ గదిలోంచి బయటికొచ్చింది.

“ హలో ..... డాక్టర్ హేమా హియర్” ఆ గొంతుని గుర్తుపట్టాడు మధుకర్.

“హేమగారూ ..... నేనూ మధుకర్‌ని ..... మహతి ఉందా అక్కడ”

ఇప్పటికి మధుకర్ మీద కోపం తగ్గలేదు హేమకు. బంగారం లాంటి మహతి బతుకును రోడ్డుపాలు చేసిన వ్యక్తిగా, అతన్ని క్షమించలేక పోతోంది హేమ.

అతనితో చాలా మాట్లాడదామన్న ఆవేశాన్ని అణుచుకుని--

“ఇప్పుడే వెళ్ళిపోయింది ..... ” అంది నిర్లిప్తంగా.

“వెళ్ళిపోయిందా ..... ఎక్కడికెళ్ళింది ..... ఆఫీస్‌కా, రెసిడెన్స్‌కా ..... ” అడిగాడు మధుకర్ ఆతృతను అణుచుకుంటూ.

“రెసిడెన్స్ కనుకుంటా ..... ”

“రెసిడెన్స్ ఎడ్రస్ తెలుసా మేడమ్ ..... ”

“జూబ్లీ హిల్స్ ..... ఎమ్మెల్యే కాలనీ రోడ్‌లోననుకుంటాను ..... ”

ఇంకేదో ప్రశ్నకు, ఇంకేదో జవాబు చెప్పబోయి, ఎదురుగా కర్టెన్ తెరచుకుని వస్తున్న వ్యక్తిని చూసి అప్రతిభురాలైంది డాక్టర్ హేమ.

అది కలా ..... నిజమా ..... గబుక్కున సీటులోంచి లేచి నిలబడింది.

“వెల్‌కమ్ సర్ ..... ” మాటలు తడబడుతున్నాయి.

“మీతో రెండు నిమిషాలు మాట్లాడాలి ..... ” తీవిగా, గంభీరంగా ఉంది ఆ గొంతు.

“టేక్ యువర్ సీట్ ..... సర్ ..... ” హేమ నుదుటిమీద చిరు చెమటలు పట్టాయి.

ఎదురుగా నిల్చున్న వ్యక్తి కుర్చీలో కూర్చున్నారు.

ఆ వ్యక్తి రాఘవేంద్ర నాయుడు.

* * * *

మహతిని కలవడానికి శతవిధాలా ప్రయత్నం చేస్తూనే వున్నాడు మధుకర్. కొన్ని వేలసార్లు ఫోన్ చేశాడు. కారు తీసుకుని హుబ్లీహిల్స్. ఎమ్మెల్యే కాలనీ ఏరియా అంతా చుట్టివచ్చాడు. ఎక్కడా, మహతి ఎడ్రస్ దొరకలేదు.

ఆఖరికి ఎలాగయినా ఆరోజు మహతిని చూడాలన్న పట్టుదలతో తనే స్వయంగా జెన్నీ ఫ్యాబ్రిక్స్ ఆఫీసులోకి అడుగుపెట్టాడు.

తనవేపు హుందాగా అడుగులేసుకుంటూ వస్తున్న మధుకర్ వేపు చిరునవ్వుతో చూస్తూ-- “వాట్ కెన్ ఐడూ ఫర్ యూ సర్ ..... ” అంది రిసెప్షనిస్ట్.

“కెన్ ఐ హేవ్ ఏ టాక్ విత్ మిస్ మహతి ..... ”

“ఒన్ మినిట్ సర్ ..... ” మహతి అపాయింట్‌మెంట్ బుక్ తీసి-

“సారీ సర్ ..... టుడే మేడమ్ ఈజ్ వెరీ బిజీ ..... టూఓ క్లాక్‌కి ఎస్.టి.సి. అఫీషియల్ మీటింగ్ ..... ఫోర్ టూ సిక్స్ డీలర్సు మీటింగ్ ..... హయత్‌నగర్ బిల్డింగ్ విజిట్ లెవెన్ థర్టీ ..... ” అందమైన ఎర్రటి పెదిమలతో మరింత అందంగా నవ్వుతూ--

“రేపు మధ్యాహ్నం ఒకసారి ఫోన్ చేస్తారా ..... ఎమ్.డి. గారి నడిగి ఎపాయింట్‌మెంట్ ఫిక్స్ చేస్తాను.”

తన చిత్రమైన పరిస్థితికి నవ్వొచ్చింది.   తను ఎలాగయినా మహతిని చూడాలి--

అదే సమయంలో విజిటర్స్‌కి సెండాఫ్ ఇవ్వడానికి బయటికొచ్చిన మహతి--

దూరంగా నిలబడిన మధుకర్‌ని చూసి- ఒక్క క్షణం చకితురాలయింది.

తన దగ్గరకొచ్చి మాట్లాడుతుందని అనుకున్నాడు మధుకర్. కానీ అనుకున్నదానికి వ్యతిరేకంగా జరగడంతో, అవమానభారంతో అతని హృదయం బరువెక్కింది. తలొంచుకుని గబగబా వెళ్ళిపోతుండగా--

"సర్ ..... " ఆపరేటర్ పిలుపుతో ఒక్కసారి వెనక్కి చూశాడు.

"మేడమ్ ..... ఫోన్ ....." పరుగు పరుగున వచ్చాడు. రిసీవర్ అందుకున్నాడు.

"చూడు మధుకర్ ..... మన లక్ష్యం గమ్యం దగ్గర పడుతోందన్న విషయం మీకు గుర్తుండే ఉంటుంది. మీరు మారాలో, పాత అలవాట్లతో స్నేహితులతోనే ఉన్నారో నాకైతే తెలీదు ..... అందుకే నేను మిమ్మల్ని పట్టించుకోవడం మానేశాను. విక్టరీ విల్ బీ మైన్ ..... దటీజ్ ఓన్లీ మై గోల్ ..... అదే స్పిరిట్‌తో నేను డే అండ్ నైట్ వర్క్ చేస్తున్నాను ..... నేను సంపాదిస్తున్న ప్రతి పైసా ..... నాదే"

ఓ.కే. మధూ ..... నెక్స్ట్ మంత్ ఫస్టు, ఉదయం  11 గంటలకు మెహిదీపట్నంలోని మన బ్యాంక్‌లో కలుద్దాం ..... ఓ.కే. మన గెలుపోటములకు మనమే సాక్షులం ..... చిన్న ప్రశ్న .....

బ్యాంక్ ఎకౌంట్ ఇంతకీ ఎంత వేసావో తెల్సుకోవచ్చా ..... అదే నీ ఓన్ మనీ ..... " చివరి ప్రశ్నలో ఉన్న వెటకారాన్ని భరించలేకపోయాడు మధుకర్.

"చూడు మహతీ ..... నీకు ఎగ్జిబిషనిజం ఇష్టం ..... నాకది ఇష్టంలేదు. నీకు నీ గురించి చెప్పుకోవడం ఇష్టం ..... నాకది ఇష్టంలేదు ..... నీ విజయం కోసం నువ్వు పోరాడడం తప్పేం- లేదు ..... కానీ అవతలి వ్యక్తిని తక్కువగా అంచనా వెయ్యడమే తప్పు. ఐయామ్ ది విన్నర్ ..... ఐనో దట్  .... బట్ ఐ విష్ యూ ఆల్ ది సక్సస్ ..... "

కోపంగా రిసీవర్ని పక్కన పడేసి, చకచకా ముందుకెళ్ళిపోయాడు మధుకర్.

వాళ్ళిద్దరి మాటల్నీ అంతవరకూ అక్కడ కూర్చుని విన్న ఆపరేటరు విషయం అర్థంకాక బిత్తరపోయింది.

ఎక్కడయినా ఆడవాళ్ళు ఒకటే- గుసగుసలకు పర్యాయపదాలు.

మహతి, గర్భవతి అన్న విషయమై ఎన్నెన్నో ప్రశ్నలు, సందేహాలు తలెత్తాయి స్టాఫ్‌లో! లంచ్ టైమ్‌లో ఊహాగానాలు సాగుతూనే వున్నాయి.

ఆ ఊహగానాలకు ఒక కేంద్ర బిందువు దొరికినట్టయింది ఆపరేటరుకు.

*　　　　*　　　　*　　　　*

జెన్నీ ఫ్యాబ్రిక్స్ ఆఫీస్‌నుంచి బయటికొచ్చి, కారెక్కిన మధుకర్‌కి మహతి మాటలే గుర్తుకొస్తున్నాయి.

ఈ పందెంలో ఎవరు గెలుస్తారు తనా? మహతా?

తనే గెలుస్తాడు ..... ఆ కాన్ఫిడెన్స్ తనకుంది.

మహతి బ్యాంక్ ఎకౌంట్‌లో ఇంతవరకూ ఎంత డబ్బు డిపాజిట్ చేసుంటుంది.?

అది కనుక్కుంటే .....

యాడ్ ఇండియాకి వెళ్ళిన మరుక్షణం ..... అతను చేసిన మొట్టమొదటి పని ... మెహదీపట్నం స్టేట్‌బ్యాంక్‌కి ఫోన్ చెయ్యడం.

బ్రాంచ్ మేనేజరు లేడు ..... ఎకౌంటెంట్ ఉన్నాడు.

"బ్రాంచ్ మేనేజరు లేరు సర్ ..... "

"మా ఎకౌంట్స్ చూస్తున్న వ్యక్తి పేరు తెలుసుకోవచ్చా."

“ష్యూర్ ..... ష్యూర్ ..... కమల అని ..... ”

“ఒ. కే. ..... థాంక్యూ” ఫోన్ పెట్టేశాడు. మళ్ళీ ఫోన్ చేశాడు మధుకర్.

“కెన్ ఐ స్పీక్ టు మిస్ కమల ..... ”

“ఒన్ మినిట్ ..... ప్లీజ్ ” కమల తన సీటులోంచి లేచి ఫోన్ దగ్గరకు నడిచి వస్తోంది.

*　　　　*　　　　*　　　　*

ఎదురుగుండా విజిటర్సుతో మాట్లాడుతున్న మహతి మెదడులో ఏదో ఆలోచన చటుక్కున కదలాడింది.

“ఇప్పటివరకూ మధుకర్ బ్యాంక్ ఎకౌంట్‌లో ఎంత ఎమౌంట్ డిపాజిట్ చేసుంటాడు.”

వెంటనే ఆపరేటర్‌కు చెప్పింది మెహదీపట్నం స్టేట్‌బ్యాంక్‌కి కనెక్షన్ ఇమ్మని.

ఆ ఆలోచన మహతిలో ఎంతో ఉత్సాహాన్నిచ్చింది.

*　　　　*　　　　*　　　　*